తిరుపతి సమగ్రాభివృద్ధికి

టిటిడి ప్రతి ఏటా రూ. వంద కోట్లు కేటాయించాలి

- తిరుపతిలో మతచిచ్చుకు యత్నించిన మతోన్మాద శక్తులను, బిజెపి అనుకూల సంస్థలను ఎదుర్కోవాలి
- సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి సమగ్రాభివృద్ధికి టిటిడి వార్షిక బడ్జెట్లో ఏడాదికి వంద కోట్ల రూపాయలు కేటాయించాలని, తిరుపతిలో మత చిచ్చుకు యత్నించిన మతోన్మాద శక్తులను, బిజెపి అనుకూల శక్తులను ప్రజలు ఎదుర్కోవాలని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి పిలుపు నిచ్చారు. సిపిఎం నగర 9వ మహాసభలు ఆదివారం యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు పాత మున్సిపల్ కార్యాలయం నుండి వేమన విజ్ఞాన కేంద్రం వరకు డప్పులు, రెడ్ షర్ట్ వాలంటీర్లు, ప్రతి నిధులు, ప్రజలతో ప్రజా ప్రదర్శన నగరంలో సందడిగా సాగింది. వేమన విజ్ఞాన కేంద్రం వద్ద సిపిఎం సీనియర్ నాయకులు వై శ్రీనివాసులు ఎర్రజెండాను ఎగరవేసి ఇటీవల మృతి చెందిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం 11 గంటల నుండి 1 గంట వరకు బహిరంగ సభ నిర్వహించి దేశ, రాష్ట్ర రాజకీయాలలో మార్పు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ప్రపంచ ప్రతిష్ట పొందిన టిటిడిలో భక్తుల సౌకర్యాల మెరుగు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారంపై నిరంతరం మాట్లాడుతూ సమస్యలను వెలుగు తీసుకొచ్చి భక్తులు, కార్మికులు, ఉద్యోగుల పక్షాన, తిరుపతి తిరుమల ప్రజల పక్షాన సిపిఎం పోరాడుతోందన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయాలలో సిపిఎం పాత్ర నిస్వార్థమని, నిజాయతీ విలువలకు పెట్టింది పేరు అన్నారు. నిత్యం పెరుగుతున్న ధరలతో తగ్గుతున్న ఆదాయాలతో, నిరుద్యోగంతో

ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

న్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలు, బలహీన వర్గాలు నిర్లక్ష్యానికి, అవమానాలకు, అత్యాచారాలకు, దాడులకు నిత్యం గురవుతున్నారని వీటిని అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడు తూ కరోనా కాలంలో ప్రజలు రోడ్లపైకి రావడానికి భయపడుతున్న రోజుల్లో ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా సిపిఎం ఆఫీసులను కరోనా కేంద్రాలుగా మార్చామని ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఎం అన్నారు. బిటిఆర్ కాలనీ ప్రాంతంలో కరోనా ఐసోలేషన్ కేంద్రాన్ని నిర్వహించి దాదాపు 200 మందికి పైగా కరోనా బాధితుల ప్రాణాలు కాపాడిందని, ప్రభుత్వాస్పత్రులను, ప్రైవేటు ఆసుపత్రులలో సిపిఎం కార్యకర్తలు కరోనా రోగులకు అండగా నిలబడి వెయ్యి మంది ప్రజల ప్రాణాలు కాపాడిన చరిత్ర సిపిఎం ది అన్నారు. టిటిడిలో అన్యాయానికి గురైన అటవీ కార్మికుల సమస్యల పరిష్కారానికి మూడున్నర సంవత్సరాల పాటు నిరంతరాయ నిరాహార దీక్ష నిర్వహించి విజయం సాధించిందన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి టిటిడి పరిపాలన భవనం ఎదుట అన్ని రాజకీయ పార్టీలను సమీకరించి నిరాహారదీక్ష చేయడంలో చురుకైన పాత్ర పోషించిందన్నారు. మూడేళ్ల కాలంలో తిరుపతిలో ఉన్న సమస్యలను నగర మహాసభలో చర్చించి భవిష్యత్ ప్రణాళికకు రూపకల్పన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి వర్గ సభ్యులు కే వేణుగోపాల్, ఎం మాధవ్ కృష్ణ, పి బుజ్జి, నరేంద్ర, ఎన్ డి శ్రీనివాసులు, చినబాబు, జయంతి, రమేష్, మల్లికార్జునరావు, రాధాకృష్ణ రామనయాదవ్ పాల్గొన్నారు.

జెండాను ఎగురవేస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు వై శ్రీనివాసులు

సొగసు చూడతరమా?

- ఎస్వీయూలో చెత్తకుప్పలు
- స్విమ్స్, రుయాస్పత్రి వ్యర్థాలు డంపింగ్..?

ప్రజాశక్తి - క్యాంపస్ : పచ్చదనం, పరిశుభ్రతతో నిత్యం కళకళలాడాల్సిన ఎంతో ప్రఖ్యాతి, ఘనమైన చరిత్ర కలిగిన శ్రీ వేంకటేశ్వర స్వామి పాదాల చెంత ఏర్పాటు చేసిన ఎస్వీ యూనివర్సిటీ నేడు చెత్త కుప్పలకు డంపింగ్ కేంద్రంగా మారింది. గత ప్రభుత్వ విధి విధానాల్లో భాగంగా ఉన్నత విద్యలో చేరే విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడమే కాకుండా విశ్వవిద్యాలయాలలో సెక్యూరిటీ భద్రత సిబ్బందిని ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైంది. అంతే కాకుండా ఎస్వీ యూనివర్సిటీకి ఎదురుగా ఫ్లైఓవర్ ఏర్పాటు చేసి గతంలో నిర్మించిన గోడను పగల గొట్టారు. దానికి సంబంధించి కాంపెన్సేషన్ డబ్బులు వర్సిటీకి అందించామని కాంట్రాక్టర్లు చెప్పినట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు ఆ ప్రహరీ గోడను ఎస్వీయూ ఉన్నతాధికారులు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరం. గతంలో జిల్లాలో రాష్ట్ర స్థాయి రెండవ నాయకుని అండదండలు, ఆదరాభిమానాలతో ఉపకులపతి గా వచ్చిన వ్యక్తి ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోకపోవడం దారుణమని విద్యార్థి సంఘాలు వాపోతున్నాయి. ఎస్వీయూ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు కేటాయించిన హాస్టల్ భవనాలను, స్థలాన్ని అప్పనంగా వేరే వారికి అప్పగించడం, ఎస్వీయూని డంపింగ్ కేంద్రంగా మార్చడం లోనూ ఆయన అనుమతి ఇచ్చారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. గతంలో ఆస్పత్రి వ్యర్థాలు, ఇతర వ్యాపార కార్యక్రమాల వ్యర్థ పదార్థాలు ఎస్వీయూలోని జి బ్లాక్ సముదాయం, హెచ్ బ్లాక్, ఐ బ్లాక్ సముదాయాలతో పాటు ఇంజనీరింగ్ విద్యార్థుల హాస్టల్ వసతి సముదాయం పరిసర ప్రాంతాలలో ఆ వ్యర్థ పదార్థాలను పారవేసేవారు. దీనిపై అప్పట్లో ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదని విద్యార్థి సంఘాల నేతలు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎస్ఐయు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా స్విమ్స్ ఆస్పత్రి వ్యర్థాలను హెచ్ బ్లాక్ పీజీ విద్యార్థుల వసతి గృహం పక్కన ఉన్న స్థలంలో చెత్త చెత్తగా చెత్త కుప్పలు డంపింగ్ చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని ద్వారా విద్యార్థులు కొంతమంది తీవ్రమైన అనారోగ్యానికి గురి అయ్యారని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. ఎస్వీయూలో ఇంజనీరింగ్ విభాగం అధికారుల అనుమతితోనే ఇటువంటి చర్యలు స్విమ్స్, రుయా ఆసుపత్రుల యాజమాన్యం చేపడుతుందని దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఉన్న డంపింగ్ కేంద్రాన్ని అక్కడి నుంచి తీసివేసి, వర్సిటీని పచ్చ దనం, పరిశుభ్రతతో నిత్యం కళకళలాడే విధంగా చూడాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. నిత్యం వర్సిటీలో మొదటి గేట్ నుంచి స్విమ్స్, రుయాకి వెళ్లే వాహనాల సంఖ్య నానాటికి పెరిగిపోతోందని, ఈ దారిలోనే ఎస్వీయూ ఆరోగ్య కేంద్రం, బోధినేతర సిబ్బంది వసతి గృహాలు, ఏ బ్లాక్, బి బ్లాక్, సి బ్లాక్, డి బ్లాక్, ఈ బ్లాక్, ఎఫ్ బ్లాక్, జి బ్లాక్, ఐ బ్లాక్, జే బ్లాక్, హెచ్ బ్లాక్ విద్యార్థి వసతి గృహ సముదాయాలు నెలకొన్నా యన్నారు. ఈ

విద్యార్థులు, సిబ్బంది తరచూ తమ అవసరాలు నిమిత్తం వర్సిటీలో తిరిగేం దుకు మొదటి గేటులోని రహదారిలో వాహనాలు అడ్డదిడ్డంగా కొంతమంది యువత బయటకు నుంచి రావడం విద్యార్థులకు, సిబ్బందికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తోందని విద్యార్థి సంఘాల నేతలు వాపోయారు. ముఖ్యంగా వర్సిటీలో భద్రతా సిబ్బంది తక్కువగా ఉందని, నూతన కూటమి ప్రభుత్వం తర్వాత వచ్చిన ఉన్నతా ధికారులు దీన్ని గమనించి వర్సిటీలో ప్రధాన గేట్ల వద్ద భవనాల వద్ద వాచ్‌మ్యాన్ సిబ్బంది సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పలు రకాల సమస్యలను వెంటనే పరిష్కరించడంలో ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు. ముఖ్యంగా ఎస్వీయూ డంపింగ్ కేంద్రంగా మారడం పట్ల విద్యార్థులు, పరిశోధకులు, విశ్రాంత ఆచార్యులు, మేధావుల వర్గం పెదవి విరుస్తున్నారు.

ఎండిన చెట్టు తొలగింపు

విద్యుత్ సిబ్బందికి స్థానికుల కృతజ్ఞతలు

ఎండిన చెట్టును తొలగించిన విద్యుత్ అధికారులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని మిట్టూరు వద్ద తిరుపతి-రాయలచెరువు ప్రధాన రహదారి పక్కన 'ఎండిన చెట్టు కూలడానికి సిద్ధంగా వుంది. ఎండిన చెట్టు కూలితే పెను ప్రమాదం సంభవించేది. ఆ విషయాన్ని గ్రహించి 'ప్రజాశక్తి' దినపత్రికలో ఆదివారం 'ఎండిన చెట్టు..కూలడానికి సిద్ధం..' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఆదివారం సాయంత్రం ఎండిన చెట్టును తొలగించారు. కమ్మ కండ్రిగ గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు చేకూరి జనార్ధన్ చౌదరి సహకారంతో రామచంద్రాపురం లైన్‌మ్యాన్ వెంకటముని యంత్రాలతో ఎండిన చెట్టును తొలగించారు. ఎండిన చెట్టును తొలగించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో స్థానికులు ప్రజాశక్తికి, విద్యుత్ శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంకు హోటల్ అసోసియేషన్ రూ.25 లక్షల ఆర్థిక సాయం

సిఎంకు చెక్కును అందిస్తున్న హోటల్ అసోసియేషన్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి, విజయవాడ వరద సహాయం నిమిత్తం, ఆంధ్రప్రదేశ్ హోటల్ అసోసియేషన్ తరపున ఆదివారం రూ .25 లక్షల ఆర్థిక సహాయం చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలను సీఎం చంద్రబాబు అభినందించారు. అమరావతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ వి స్వామి , సెక్రటరీ ఎం. నాగరాజు ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఐ రఘువీర్ , ట్రెజరర్ ఈవి పూర్ణ చంద్ తిరుపతి జిల్లా అధ్యక్షులు చిల్లీస్ అంజి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పలు జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి నిత్యాన్నదాన పథకానికి పెనగలూరుకు చెందిన లీలావతి కుటుంబ సభ్యులు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందించారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఈవో బాపిరెడ్డికి అందజేసి నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాలని కోరారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.

ఇసుక డంప్‌లు సీజ్ చేయాలి: ఆర్‌డీవో



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలో ఇసుక డంప్ లు కలకలం సృష్టిస్తున్నాయి. పలుచోట్ల ఇసుక డంపింగ్ స్థావరాలు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఆ మేరకు ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి ఫిర్యాదు చేయగా సీజ్ చేయాలని తొట్టంబేడు తహశీల్దారును ఆదేశించారు. ఇటీవల కాలంలో తొట్టంబేడు మండలంలోని క్వారీలు, క్రషర్ల మాటున ఇసుక డంప్ చేసి అక్కడినుంచి చెన్నైకి తరలిస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఆ మేరకు టూ టౌన్ పోలీసులు, తొట్టంబేడు పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించగా పలు ఇసుక డంప్‌లను గుర్తించినట్లు సమాచారం. రిలయన్స్ పెట్రోల్ బంకు వెనుక భాగంలో ఒకటి, తంగేళ్లపాలెం తెలుగు గంగ కాలువ సమీపంలో మరొక ఇసుక డంప్ ను గుర్తించినట్లుగా తెలుస్తోంది. తంగేళ్లపాలెం క్రాస్, బీడీ కాలనీ, శివనాథ పాలెం తదితర ప్రాంతాల్లో కూడా ఇసుక డంపులు ఉన్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. తొట్టంబేడులో ఇసుక డంపుల విషయంపై ఆ మండల తహశీల్దారు మధుసూదన్ రావు ను వివరణ కోరగా రిలయన్స్ పెట్రోల్ బంకు వెనుక భాగంలో ఉన్న ఓ ప్రైవేటు లే-అవుట్ లో ఇసుక డంపు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆర్డీవో ఆదేశాల మేరకు ఆ లే-అవుట్ యజమానిపై కేసు నమోదు చేసి డంపును స్వాధీనం చేసుకోనున్నామని వివరణ ఇచ్చారు. తొట్టంబేడు మండల పరిధిలో ఎక్కడ అక్రమ ఇసుక నిల్వలు ఉంచినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఆర్‌అండ్‌బి రోడ్డు ఆక్రమణ

- దర్జాగా దుకాణం ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -కోట : కోట మండలం వెంకన్నపాలెం గ్రామం సమీపంలో ఉన్న ఇటుక బట్టీల ఎదురుగా ప్రధాన రహదారి పక్కనే ఓ వ్యక్తి ఆర్‌అండ్‌బి రోడ్డును ఆక్రమించి ఏకంగా రేకుల షెడ్ దుకాణాన్ని నిర్మించాడు. రోడ్డు స్థలం ఆక్రమించి రేకులు షెడ్ నిర్మించినా పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారులు చూస్తూ మౌనంగా వుంటున్నారే తప్ప పట్టించుకోవడంలేదు. ప్రస్తుతం అధికారులు స్పందించకుంటే భవిష్యత్తులో మరిన్ని దుకాణాలు ఏర్పాటు అయ్యే ప్రమాదం వుందని స్థానికులు పేర్కొంటున్నారు.

వెంకన్నపాలెం గ్రామ సమీపంలో కోట క్రాస్ రోడ్డు నుండి వాకాడు కు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే రేకుల షెడ్డుతో దుకాణం దర్శనమిస్తోంది. ప్రస్తుతం ఒక దుకాణం ఏర్పాటు చేయడం బాగానే వుందని, కానీ రోజు రోజుకు చూసుకో ఒకరిని చూసి మరొకరు దుకాణాలు ఏర్పాటు చేసే అవకాశం వుందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా తక్కువ స్థలం వుంది. అందులో ఇలాంటి ఆక్రమణలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోట మండలం తిన్నెలపూడి పంచాయతీ పరిధిలో ఉన్న రంగన్నగుంట వద్ద వరుసగా దుకాణాలను అక్రమంగా ఏర్పాటు చేశారు. ఇప్పటికీ రంగన్నగుంట వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన ఆక్రమ దుకాణాల

రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణం

గురించి, విద్యుత్ కనెక్షన్ ఎలా ఇచ్చారు? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ముందు జాగ్రత్తల్లో భాగంగా ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే ఇలాంటి ఆక్రమణ దుకాణాల ఏర్పాటు పునరావృతం కాకుండా సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇటీవల కోట ఆర్‌అండ్‌బి శాఖకు నూతనంగా ఢిల్లీ ఏపీ భవన్ నుండి డిఈగా చంద్రశేఖర్ రెడ్డి బదిలీ అయ్యారు. అయితే ఆర్‌అండ్‌బి పనుల నిర్మాణం, ఆక్రమణల్లో ఆయన ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు: సిఐ

మాట్లాడుతున్న సిఐ మురళి

ప్రజాశక్తి -సత్యవేడు: కాలక్షేపం కోసం, సులభంగా డబ్బు సంపాదించే ఆలోచనలతో ఇంటర్నెట్ వేదికగా చాలా మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని, దీనిపై అప్రమత్తంగా వుండాలని సత్యవేడు సీఐ మురళి హెచ్చరించారు. పుత్తూరు డిఎస్‌పి పర్యవేక్షణలో సత్యవేడు సిఐ పరిధిలోని వరదయ్యపాలెం, సత్యవేడు, నాగలాపురం మండలాలలో ప్రజలకు సైబర్ నేరాలు- అప్రమత్తతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువకులు, మహిళలు, ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోతూ మానసికంగా చితికిపోతున్నారన్నారు. వీటిపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజలకు మొబైల్ ఫోన్ ద్వారా ఇంటర్నెట్ వాడకంపై సైబర్ నేరగాళ్లను గుర్తించే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మొబైల్ ఫోన్ ఉన్నవారు ఏ యాప్ ఎక్కువగా వాడుతున్నారు? ఉదాహరణకు గూగుల్, ఫేస్‌బుక్, యూట్యూబ్ గమనించి సైబర్ నేరగాళ్లు ఆయా మొబైలకు వారిని ట్రాప్ చేసే లింకుల్ని పంపిస్తూ వాటిని క్లిక్ చేస్తే ఆర్థికంగా వారి జీవితాలు మారిపోతాయని కలల ప్రపంచంలోకి తీసుకునే వెళ్లే విధంగా ఊరిస్తారని లింకులు క్లిక్ చేయమని పంపిస్తారని తరువాత వారిని తమ ఉచ్చులోకి బిగించుకొని ఆర్థికంగా చిదిమేస్తారని వీటి బారిన పడ్డవారు తమ వద్దకు వస్తున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి జీవితాలు నాశనం చేసుకొని కుటుంబాలను వీధిన పాలు చేసుకోవద్దని హెచ్చరించారు. ఏ విధమైన లింకులు మొబైల్‌లకు వచ్చినా స్పందించవద్దని ఓటీపీలు ఎవరు ఫోన్ చేసి అడిగినా చెప్పకూడదని, నూటికి 99.9 శాతం లింకులు అన్ని ఫేక్ లింకులే అని అప్రమత్తంగా ఉండాలని సిఐ సూచించారు.

రైళ్లలో జనరల్ కోచ్‌లు పెంచండి: ఎంపీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సామాన్య ప్రయాణికుల రద్దీని దృష్టిలో వుంచుకుని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రెండు జనరల్ కోచ్‌లను పెంచాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి రైల్వేబడ్జెట్ చర్చలో భాగంగా పార్లమెంట్‌లో డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వేశాఖకు గురుమూర్తి వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో గురుమూర్తి కృషి, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌లలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఎట్టకేలకు ఇప్పటికే ఉన్న రెండు జనరల్ కోచ్‌లకు మరో రెండు కోచ్‌లను విడతల వారీగా జత చేయడానికి రైల్వేశాఖ పేర్కొనడంతో రైల్వేశాఖకు గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సందర్భంలో కోవిడ్ సమయంలో కొన్ని స్టేషన్లలో నిలిపివేసిన రైళ్లనూ పునరుద్ధరించాలని ఎంపీ కోరారు. ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

క్రీడలతో ఉన్నత భవిష్యత్తు

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలలో శాప్ ఛైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): క్రీడలతో మానసిక అభివృద్ధికి తోడ్పడడమే కాకుండా ఉన్నత భవిష్యత్తు లభించేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి దేశం లో ఏ రాష్ట్రంలో లేని విధంగా స్పోర్ట్స్ పాల సీని రూపొంది స్తున్నామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. మంగళం పరిధి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్‌లో ఆదివారం 68వ బేస్ బాల్ అండర్ 14 కాంపిటీషన్‌ను ముఖ్య అతిథిగా హాజరైన శాప్ ఛైర్మన్ రవి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి 13 జిల్లాల నుంచి విద్యార్థినివిద్యార్థులు, ఆయా పాఠశాలల పిఈటిలు, పీడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ గతంలో కంటే భిన్నంగా క్రీడల ప్రోత్సాహకానికి శ్రీకారం చుట్టామన్నారు. పాఠశాల స్థాయి నుండి క్రీడలకు ప్రోత్సాహమిస్తూ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తీసుకొస్తామన్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) పద్ధతులలో క్రీడలను అభివృద్ధి చేస్తామని, నూతన స్పోర్ట్స్ పాలసీలో ఒలంపిక్‌లో బంగారు పతకం సాధిస్తే ఏడు కోట్ల రూపాయలు నజరానాతో పాటు గ్రూప్ వన్ కేడర్ ఉద్యోగాన్ని, సిల్వర్ మెడల్ సాధిస్తే రూ.ఐదు కోట్లు, బ్రాంజ్ మెడల్ సాధిస్తే మూడు కోట్ల రూపాయలు ఇవ్వాలని ప్రతి పాదనలు సిద్ధం చేశామన్నారు. క్రీడలకు మంచి ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామీణ క్రీడాకారులకు మంచి ప్రోత్సాహకాలు అందించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్ది రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చేలా కృషి చేయాలని ఇప్పటికే సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆదేశించారన్నారు. రాబోయే ఒలింపిక్స్‌కు మన తెలుగు ఆణిముత్యాలను అంతర్జాతీయ వేదిక పైకి పంపడానికి శాప్ కృషి చేస్తోందన్నారు. అమిగోస్ బిల్డర్స్ ఎండి అనిత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలలో మనోవికాసాన్ని విద్యార్థులు పొందగలిగితే గెలుపు, ఓటముల మూల్యాలను తెలుసుకోవచ్చని తద్వారా విద్యార్థుల ఆత్మహత్యలను నివారించవచ్చన్నారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు కేశవులు నాయుడు మాట్లాడుతూ ఈ బేస్ బాల్ అండర్ 14 కాంపిటీషన్స్ లో విజయం సాధించిన విద్యార్థినివిద్యార్థులు డిసెంబర్‌లో చత్తీస్ ఘడ్‌లో జాతీయ బేస్ బాల్ కాంపిటీషన్ లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ, ఎస్ఎంసి ఛైర్మన్ షేక్ భాను, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శులు బాబు, రామకృష్ణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రెడ్డి, సాంఘిక ఉపాధ్యాయులు కృష్ణమనాయుడు, ఉత్తమ పిఈటి అవార్డు గ్రహీత ప్రభాకర్, పూర్ణచంద్ర, టిడిపి నాయకులు ఈశ్వరయ్య, తెలుగు యువత అధ్యక్షులు జ్యోతికృష్ణ, జనార్ధన్, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా జ్యోతిని వెలిగించి రాష్ట్ర బేస్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

క్రీడాంధ్రప్రదేశ్‌కు ప్రణాళికలు సిద్ధం

- పాఠశాలల నుండే క్రీడాకారుల గుర్తింపు
- క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- 'ప్రజాశక్తి'తో శాప్ ఛైర్మన్ రవినాయుడు ముఖాముఖి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలను అభివృద్ధి చేసి క్రీడాకారులకు ఉన్నత భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఛైర్మన్ రవి నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల గుర్తింపు, ప్రోత్సాహకాలపై శాప్ ఛైర్మన్ రవినాయుడు 'ప్రజాశక్తి' నిర్వహించిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు. గత ప్రభుత్వం క్రీడాకారులకు మంచి గుర్తింపు ఇవ్వలేదని, క్రీడలను స్వార్థ రాజకీయ క్రీడలుగా మార్చి క్రీడల పట్ల ఆసక్తి లేకుండా చేసిందని ఆయన ఆరోపించారు.

ప్రజాశక్తి: గ్రామీణ క్రీడాకారుల అభివృద్ధికి శాప్ ఛైర్మగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

శాప్ ఛైర్మన్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను ఆయా పాఠశాలల పరిధిలో క్రీడా వికాస వేదికలను ఏర్పాటు చేసి, ఆయా వేదికల పరిధిలో ఉన్న సమీప పాఠశాలలను కేంద్రీకృతం చేస్తాం. ఇలా ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు ఏ క్రీడ పట్ల ఆసక్తి చూపుతున్నారో గుర్తించి, ఆ క్రీడలకు సంబంధించిన దుస్తులు, వస్తువులు అందిస్తాం. ఆ క్రీడాకారుడి ప్రతిభను ప్రాథమికంగా నమోదు చేసుకుని పాఠశాల స్థాయి నుండి క్రీడాకారుడిగా గుర్తింపు పొందేలా తగిన ప్రోత్సాహకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నుండి పర్యవేక్షించేలా ఓ ప్రణాళిక బద్ధమైన వ్యవస్థను అమలు చేయాలని నిర్ణయించాం. అలా గుర్తింపు పొందిన క్రీడాకారుడు పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయం స్థాయి వరకు పర్యవేక్షణలో ఉంటారు. వారు నేర్చుకుంటున్న క్రీడకు అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేసి, జాతీయస్థాయిలో, ఏషియన్ గేమ్స్ లో, ఒలింపిక్స్ లో ఇలా ఏ వేదికైలోనైనా మంచి పథకాలు సాధించేలా ప్రోత్సాహకాన్ని ఇస్తాం.

ప్రజాశక్తి: నూతన స్పోర్ట్స్ పాలసీలో ఎటువంటి అంశాలను చేర్చారు?

శాప్ ఛైర్మన్: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టాక విద్యాశాఖ మంత్రిగా లోకేష్ క్రీడల అభివృద్ధికి ఎంతో ముందు చూపుతో నిర్ణయాలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే ప్రతి పాఠశాలలో పిల్లలు ఆడుకోవడానికి మైదానం ఉండాలని జీవోను ఇచ్చారు. విద్యతో సమానంగా క్రీడను తీసుకున్న విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవడం చాలా సులువు. అందుకే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా క్రీడలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ ఈ స్పోర్ట్స్ పాలసీని రూపొందిస్తున్నాం. ఈ పాలసీలో క్రీడాకారులకు ప్రోత్సాహకాలను ఇస్తూ వారిలో మరింత ఉత్తేజాన్ని తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే సూచించారు. ఒలింపిక్స్ లో బంగారు పతకాన్ని సాధిస్తే ఏడు కోట్ల రూపాయల నజరానాతో పాటుగా గ్రూప్ వన్ కేడర్ ఉద్యోగాన్ని ఇవ్వాలని నిర్ణయించాం. అలానే వెండి పథకాన్ని సాధిస్తే ఐదు కోట్ల రూపాయలు, బ్రాంజ్ పథకాన్ని సాధిస్తే మూడు కోట్లు, రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో పథకాలను సాధించే వారికి కూడా ఇలాంటి ప్రోత్సాహకాలు కొత్త స్పోర్ట్స్ పాలసీలో ఉన్నాయి.

ప్రజాశక్తి: ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన క్రీడాకారులకు తగిన ప్రోత్సాహకం అందిస్తారా?

శాప్ ఛైర్మన్: కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు , విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రతిభనే ప్రామాణికంగా భావించి క్రీడాకారుల అభివృద్ధికి తగిన తోడ్పాటు ఇస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా క్రీడల నిర్వహణకు ముందస్తుగానే నగదు చెల్లింపులు చేశారు. ఇది ఓ ప్రామాణికంగా ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎవరైనా క్రీడాకారులు ఆర్థికంగా వెనుకబడి తమ ప్రతిభను సమాజానికి చాటడానికి ఇబ్బందులు పడుతుంటే వారికి కూడా క్రీడా పరంగా తగిన తోడ్పాటు ఇవ్వాలని నిర్ణయించాం. రెసిడెన్షియల్ అకాడమీలను ఏర్పాటు చేసి అక్కడ ఆ క్రీడాకారులకు సంబంధించిన వసతులను పర్యవేక్షిస్తూ వారి క్రీడా మనోవికాసానికి అవసరమైన చర్యలు తీసుకునేలా ఓ ప్రణాళికను చేయాలని అనుకున్నాం. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ల దృష్టికి తీసుకెళ్లి రెసిడెన్షియల్ అకాడమీలను ఏర్పాటు చేసేలా త్వరలోనే నిర్ణయాలు తీసుకుంటాం.

ప్రజాశక్తి: క్రీడా ప్రాంగణాల్లో వసతుల కల్పన ఏ విధంగా సాగుతోంది?

శాప్ ఛైర్మన్: గత ప్రభుత్వ హాయంలో క్రీడా ప్రాంగణాలను అడ్డగోలుగా వారి సొంతానికి వినియోగించుకున్నారు. క్రీడా ప్రాంగణాలను ఇకపై అలా వినియోగించుకోవడానికి వీలు లేకుండా క్రీడాకారుల అభివృద్ధి కోసం క్రీడా ప్రాంగణాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నాం. మూడు రకాలుగా క్రీడాకారులను అభివృద్ధి చేయడానికి నూతన ప్రణాళికలో నిర్ణయం తీసుకున్నాం. అందులో భాగంగానే పాఠశాలలో క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల గుర్తింపు, పాఠశాల నుండి విశ్వవిద్యాలయ విద్య వరకు ఆ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం కొనసాగుతుంది. క్రీడలకు సంబంధించి గతంలో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో నిజమైన క్రీడాకారులకు వాటి లబ్ధిని దూరం చేసే పరిస్థితిని గుర్తించాం.. ఇకపై అలాంటివి జరగడానికి తావు లేకుండా డిజిటల్ సర్టిఫికెట్లను అందించడానికి సన్నాహాలు చేస్తున్నాం. క్రీడాకారుడి ఆధార్ ద్వారా ఏ క్రీడలో రాణిస్తున్నాడో దానికి తగ్గ ట్రైనింగ్‌ను ఇవ్వాలని నిర్ణయించాం. రాష్ట్రంలో ఉన్న ఇండోర్ స్టేడియం అన్ని డిసెంబరు లోగా శాప్ నియంత్రణలోకి వచ్చేలా చర్యలు తీసుకున్నాం. పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) పద్ధతిలో ఆంధ్ర ప్రదేశ్‌లో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

ఎన్‌బికెఆర్ కళాశాలలో 'ఒక క్యాడెట్ - ఒక చెట్టు'

మొక్కలు నాటుతున్న ఎన్‌సిసి క్యాడెట్లు

ప్రజాశక్తి -కోట : కోట మండలం విద్యానగర్ ఎన్‌బికె ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ వి విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 76 ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా 'ఒన్ క్యాడెట్ - వన్ ట్రీ' పేరుతో పర్యావరణ డ్రైవ్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఎన్‌సిసి సామాజిక సేవ, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యకలాపాలలో భాగమైన ఈ కార్యక్రమంలో పలువురు ఎన్‌సిసి క్యాడెట్‌లు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటారు. ఎన్‌సిసిలో తమ ఉద్యోగ కాలం అంతా చెట్టును సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం యువతలో పర్యావరణ పరిరక్షణను పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి క్యాడెట్లు 100 మొక్కలు నాటారని ఆర్మీ అధికారి గోవింద మాధవయ్య తెలిపారు.

తిరుపతి డెస్క్: మొక్కలను, పెరటి కోళ్ల పెంపకం వాటి సంరక్షణ దినచర్యలో భాగం కావాలని శాస్త్రవేత్తలు సూచించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలోని మొక్కల సాగు క్షేత్రాన్ని స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. క్షేత్రంలో చేస్తున్న పెరటి మొక్కలు ఔషధ, ఆయుర్వేద మొక్కలను, పూల మొక్కలను. పలు రకాల పెరటి కోళ్లను పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మొక్కల పెంపకంలో మెళకువలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అధికారులు చంద్రశేఖర్, శైలజ, ప్రధానోపాధ్యాయురాలు శశికళ, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో విలువ: జూలియన్ రాజు

ప్రజాశక్తి -రేణిగుంట: గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు విద్యతోనే సమాజంలో విలువ చేకూరుతుందని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు అన్నారు. చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రేణిగుంట మండలం వెదుళ్ల చెరువు ఎస్టీ కాలనీలో ఆదివారం సాయంత్రం గిరిజన విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వెదళ్ల చెరువు ఎస్టీ కాలనీలో గిరిజన పిల్లలను విద్యావంతులను చేయాలని బ్యాంకు ఉద్యోగిగా, విశ్రాంత ఉద్యోగిగా తన వంతు సాయం చేస్తున్నానన్నారు. కాలనీలో బాల్యవివాహాలు ఎవరైనా చేయాలనుకుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను పనులకు పంపకుండా బడికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేయూత సంస్థ కార్యదర్శి శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్ గంగమ్మ, ప్రసాద్, అపర్ణ పాల్గొన్నారు.

నేడు బీసీల ర్యాలీ

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణ్ నాగరాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమగ్ర కులగణనతో పాటు, కూటమి ప్రభుత్వం హామీ మేరకు బీసీలకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద బీసీల భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణ్ నాగరాజు తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే ఈ ర్యాలీ డీబీఆర్ రోడ్డులోని బీసీ మండల్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సాగుతుందన్నారు. 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అణగారిన వర్గాలు, వెనుకబడిన తరగతులైన ఓబీసీల జనగణన కులాల వారీగా వివరాలను శాస్త్రీయంగా సేకరించకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దేశ జనాభాలో 52 శాతానికిపైగా ఉన్న బీసీలకు మండల్ సిఫార్సుల మేరకు 1993 నుంచి 27 శాతం రిజర్వేషన్లను మాత్రమే అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర కులగణన చేపట్టి బీసీలకు రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల్లో, చట్టసభల్లో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి జగదీష్, నాయకులు బాబు ఆచారి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్వీయూలో గ్రామోత్సవ క్రీడలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం క్రీడలు ఆదివారం ప్రకాశం భవనం ప్రాంగణంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై చిన్న చిన్న కుటుంబాలుగా మారడంతో, ఈ కుటుంబాలు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాయని, దీనిని ఛేదించాలంటే గ్రామోత్సవ క్రీడల వంటి ఉత్సవాలను నిర్వహించాలని, తద్వారా మానసిక ఉల్లాసం ఏర్పడి ఒత్తిడి నుంచి బయటకు రావచ్చని అన్నారు. గ్రామోత్సవం పేరుతో ఇషా ఫౌండేషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇషా ఫౌండేషన్ తిరుపతి ప్రాంత కన్వీనర్ సైకియాట్రిస్ట్ డాక్టర్ రోహిత్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో గ్రామాలలో నూతన ఉత్సాహం తీసుకురావడమే ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య అధ్యాపకుడు ఆచార్య శివశంకర్ రెడ్డి, ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఎస్వీయు సిఐ రామయ్య, తిరుపతి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : ఏర్పేడు మండలంలోని కందాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009 నుండి 2010 సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు రామచంద్ర నాయుడు(హెడ్మాస్టర్), రామ ప్రసాద్, మోహన్ బాబు, శైలజ, భారతి, గాయత్రి , పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండల పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఏర్పేడు సీఐ జయచంద్ర పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు పై పోలీసుల నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబరాలు

ఆనందం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించడం పట్ల శ్రీకాళహస్తి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. జార్ఖండ్‌తో పాటు వాయనాడ్, నాందేడ్ ఎంపీ సీట్లను కూడా కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పట్ల ఆ పార్టీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు హర్షం వ్యక్తం చేశారు. బత్తెయ్యనాయుడు మాట్లాడుతూ మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమి షిండే అజిత్ పవార్ ఒక్కటై విజయం సాధించినప్పటికీ, జార్ఖండ్‌లో సోరెన్ నాయకత్వంలో రాహుల్ గాంధీ గారి సహకారంతో ఇండియా కూటమి ఘన విజయం సాధించినట్లు గుర్తు చేశారు. జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో, ఇండియా కూటమి కాశ్మీర్ ను వశపరచుకోగా, హర్యానాలో కన్నులపడేట్టుగా 0.4 శాతంతో ఎన్డీఏ కూటమి అధికారానికి వచ్చిందని ఎద్దేవా చేశారు. మోడీ పరోక్షంగా అవినీతిని ప్రోత్సహిస్తున్నాడని ఆదానీనే ఉదాహరణ అని విమర్శించారు. వెంకట మునిరాజు, పడివేలు, శెట్టిపల్లి శివ, రాఘవరెడ్డి, ఈశ్వర్ గోపి, నాగూర్, సురేష్, బాలాజీ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం 76 వ ఎన్‌సిసి దినోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ ఎన్ సిసి వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావం మొదలైన సద్గుణాలు ఏర్పడతాయని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫామ్ యువజన దళంగా ఎన్సిసి ప్రసిద్ధి పొందిందని. ఎన్ సిసి విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు కూడా మెరుగ్గా ఉంటాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఎన్ సి సి దినోత్సవ సందర్భంగా లెఫ్ట్ నెంట్ నుంచి కెప్టెన్ హోదా పొందిన కళాశాల ఎన్ సి సి అధికారి వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు .వివిధ శిక్షణ శిబిరాలలో పాల్గొన్న క్యాడెట్లకు పురస్కారాలు అందజేశారు. కళాశాల నుండి మిలిటరీ క్యాంపుల ద్వారా పి రవికిరణ్ శిక్షణ పొందుతున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి అధికారి డా. శ్రీనివాసులు, ఆర్.బి. వాణిశ్రీ, ఏ. దేవికి, పి. గాయత్రి, తిరుమలయ్య, జి. గంగయ్య, మురళీ మోహన్ రెడ్డి, అధ్యాపకులు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు: ఎస్‌ఐ

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని బుచ్చినాయుడు కండ్రిగ సబ్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథ నాయుడు హెచ్చరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి డీఎస్పీ పర్యవేక్షణలో బుచ్చయ్యనాయుడుకండ్రిగ సిఐ తిమ్మయ్య పరిధిలోని బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం, సత్యవేడు, మండలాలలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని ముఖ్యంగా యువకులు, మహిళలు, ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోతూ మానసికంగా కుంగిపోతున్నారని వీటిపై ప్రత్యేక దృష్టి పోలీసు శాఖ పెట్టి ప్రజలకు మొబైల్ ఫోన్ ద్వారా ఇంటర్నెట్ వాడకంపై సైబర్ నేరగాళ్ళను గుర్తించే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

రైతు, కార్మిక సంఘాల నేతల పిలుపు

మాట్లాడుతున్న వివిధ కార్మిక, రైతు సంఘాల నేతలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రైతు సంఘాల సమన్వయ సమితి, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టే మహా ధర్నాకు రైతులు, కార్మికులు, ప్రజా సంఘాల నేతలందరూ పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘాల నేతలు ఎ రామా నాయుడు (సిపిఐ), మాంగాటి గోపాల్ రెడ్డి, హేమలత (సిపిఎం) పిలుపు నిచ్చారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పోరాటాలతో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజా హక్కుల సాధనే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా 530 జిల్లాల్లో ఆయా జిల్లా కార్యాలయాల వద్ద మహా ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రైతులు, కార్మిక, ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణం విరమించుకొనే విధంగా ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ప్రజా సంక్షేమ దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు రాధాకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, జయచంద్ర, ఐఎఫ్‌టీయూ నేత భారతి, ఆర్ వెంకయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిలో యుటిఎఫ్ పాత్ర కీలకం

ప్రజాశక్తి - వెంకటగిరి: ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిలో యుటిఎఫ్ పాత్ర కీలకం అని పలువురు యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరి ప్రాంతీయ శాఖల యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు, మండల మహా సభలు వెంకటగిరి పింజల వీరయ్య ఫంక్షన్ హాలులో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం యుటిఎఫ్ పతాకాన్ని రిటైర్డు ఉపాధ్యాయుడు, ఉద్యమ నాయకుడు పి రాధాకృష్ణ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దాచూరు రాంరెడ్డి అప్పారి వెంకటస్వామి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించి వారి పోరాటాలు, సంఘ నిర్మాణంలో వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం కుమారస్వామి అధ్యక్షతన ప్రారంభమైన విద్యా సదస్సులో తిరుపతి జిల్లా సహాధ్యక్షులు కె ఎస్ బి సూర్యప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా ఉపాధ్యాయ ఉద్యమం అజరామంగా, అవినీతికి వ్యతిరేకంగా రాజీ లేని పోరాటం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ బడులలో చదువుతున్న పేద బిడ్డలకు న్యాయమైన, నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తూ విద్యారంగ అభివృద్ధికి, ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం తీసుకెళ్లి పరిష్కారం చేయడానికి కృషి చేసిందన్నారు. సభాధ్యక్షులు ఎం కుమార్ స్వామి మాట్లాడుతూ సంబరాలలో యుటిఎఫ్ వెంకటగిరి ప్రాంతీయ మండల శాఖలు అన్ని పోరాటాలను ధర్నాల్లోనూ ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారని అదేవిధంగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో వెంకటగిరి ప్రాంత నాయకులు చాలా ఎక్కువగా కృషి చేస్తున్నారని సామాజిక స్పృహంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన పేద విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఎదురైనా పెద్ద ఎత్తున విరాళాలు సేకరించడంలో యూటీఎఫ్ పాత్ర ఎక్కువగా ఉందన్నారు. జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించడంలో వెంకటగిరి ప్రాంతీయ మండల శాఖలో అద్భుతంగా పనిచేశాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శులు మోహన్ బాబు, విజయ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎండపల్లి విజయశ్రీ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి శివకుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఆదినారాయణ, వెంకటగిరి గౌరవాధ్యక్షుడు కె.ఉదయకుమార్, వెంకటగిరి అధ్యక్షులు జగదీశ్వరి, డక్కిలి అధ్యక్షులు చల్లా గంగారావు , ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు , బాలాయపల్లి అధ్యక్షులు సరస్వతి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో సామూహిక కోలాట నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వర్సిటీ ఉద్యోగి, శ్రీ అన్నమయ్య డాన్స్ అకాడమీ కన్వీనర్, తిరుపతి అన్నమయ్యగా పేరు పొందిన రాంబాబు ఆధ్వర్యంలో ఎస్వీయు పరిపాలన భవనం, వేంకటేశ్వర స్వామి ముందు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ కోసం 'బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే సామూహిక కోలాట నృత్య ప్రక్రియ'ను నిర్వహించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కృష్ణమూర్తి, ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తన బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే గీతం సమస్త జగత్తులో అందరూ సమానమే అని ఆ కాలంలోనే ఉద్ఘాటించబడింది అన్నారు. అలాంటి కీర్తనను ఈరోజు స్వామి పాదాల చెంతన, స్వామి పేరుగల వర్సిటీలో ఒక రికార్డు ప్రక్రియ కోసం ఎంచుకొని, దానిని ప్రదర్శించడం గొప్ప కార్యక్రమం అన్నారు. ఇక్కడ పాల్గొన్న దాదాపు 1250 మంది కళాకారులను శిక్షణ ఇచ్చి, వారందరినీ ఏకం చేసి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు శ్రీరామ్ బాబుని అభినందించారు. కార్యక్రమం అనంతరం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా కోఆర్డినేటర్ బింగి నరేంద్ర గౌడ్, ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ 1250 మంది కళాకారులు ఏకకాలంలో పాల్గొనడం ఒక రికార్డు అని, దాన్ని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు చేశామని చెప్పారు. అందుకు సంబంధించిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్ ను ముఖ్య అతిథులు చేతుల మీదుగా రాంబాబుకి అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయు ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఆర్కే అబాకస్ అధినేత రామకృష్ణారెడ్డి, తిరుపతి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేత సుమతీ రెడ్డి, ఎస్వీయు ఇంజనీర్ తాండవ కృష్ణ, డాక్టర్ ఆనంద్ బాబు, రవీంద్రబాబు, ఎం శ్రీనివాసులు, కే శ్రీనివాసులు, తిరుపతి పరిసర ప్రాంతాల కోలాట నృత్య కళాకారులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరం

వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి - పెళ్లకూరు: తిరుపతి జిల్లా సత్యవేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో ఆదివారం పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరిశంకర్, సీఈవో సీతారామ నాయుడు మాట్లాడుతూ అనుభవం వున్న ప్రత్యేక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో కంటి చూపు బాధితులు 200 మందికి పరీక్షలు నిర్వహించి వైద్యం అందించినట్లు తెలిపారు. ఈ క్రమంలో 100 మందికి ఉచితంగా మందులు పంపిణీ,50 మంది రోగులకు ఉచిత కంటి అద్దాలు అందించి 15 మందికి ఉచితంగా ఆపరేషన్స్ చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణ గల్లా, ఇన్చార్జి హెడ్ మాస్టర్ పాండురంగయ్య, అరవింద్ నేత్రలయ సిబ్బంది దిలీప్ పాల్గొన్నారు.

చెస్‌తో మేధాశక్తి పెంపు

చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చెస్ క్రీడ వల్ల మేధాశక్తి ఎంతో పెరుగుతుందని చిన్నతనం నుండి చెస్ ఆడడం వల్ల ఎత్తుకు పైఎత్తులు అలవాటు పడతారని గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రవి ప్రసాద్ వెల్లడించారు. నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ , తిరుపతి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి చెస్ క్రీడా పోటీలను ప్రిన్సిపల్ ప్రారంభించారు. 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ రవి ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవస రమని చెస్ క్రీడ వల్ల మేధాశక్తి పెరుగుతుందని అన్నారు .మేధాశక్తి పెరుగుదల వల్ల భవిష్యత్తులో ఎన్నో ఉపయోగాలు ఉంటాయని పిల్లల్లో ఉన్న క్రీడా ఆసక్తిని తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫణి కుమార్, మంజుల, నరేంద్ర పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గున్నం మధుసూదనరెడ్డి ట్రస్ట్ లాంటివారు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘంతో కలిసి నిత్యావసరసరుకులు అందించడం చేయడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యుడు ప్రజేందర్ రెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో గున్నం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు . ప్రతి నెల నాల్గవ ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్ట్ నిర్వాహకుడు మధుసూదన్ రెడ్డి సహకారంతో గున్నం సేవా ట్రస్ట్ భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నారు . ఈ క్రమంలో ఆదివారం ఎంపిక చేసిన రెడ్డి కమ్యూనిటీలోని పేదలకు నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యుడు ప్రజేందర్ రెడ్డి మాట్లాడుతూ మధుసూదన్ రెడ్డి ఆయన ట్రస్టు ద్వారా ఆయన జన్మించిన గ్రామం, చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్ట్ భరోసా సంక్షేమ పథకాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దాతల సహకారంతో ఇలాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించేందుకు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం పాటుపడుతుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు .

భూకబ్జా దారులపై చర్యలు తీసుకోవాలి

- గ్రామ సేవకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లపూడి సుబ్బయ్య

ఆందోళన చేపట్టిన గ్రామ సేవకుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : భూ కబ్జా దారుల పై చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ సేవకుల సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లపూడి సుబ్బయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గూడూరు మండలం పోటు పాలెం గ్రామంలో 20 మంది తలారులకు పోటుపాలెం లో 13 ఎకరాల 20 సెంట్లు ఇచ్చారు. ఈ భూమిని సుమారు 25 సంవత్సరాల నుండి తహశీల్దారు ఆఫీసులో పనిచేస్తూ తలారిలుగా ఉన్న గ్రామ సేవకులు సాగు చేసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వంలో 1990వ సంవత్సరంలో తలారిలకు అందరికీ పట్టాలను మంజూరు చేశారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సమయంలో అదే గ్రామానికి చెందిన వేణుమాకు రమణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి ఇద్దరు కలిసి తలారులు చేస్తున్న భూమిని వచ్చి దౌర్జన్యంగా తమది అని గొడవ చేస్తున్నారు. దాన్నిప్రభుత్వం వాళ్ల గుర్తించి గ్రామ సేవకులకు న్యాయం చేయాలని కోరారు. తలారీ లకు నెలవారి జీతాలు 10,500 ఇస్తారని, చాలీచాలని జీతంతో జీవనాధారం కొనసాగిస్తున్నారన్నారు. ఉన్న భూమిని కూడా పెత్తందారులు లాక్కుంటున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి తలారి లందరికీ న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవయ్య, పిండి బాబు, రాజయ్య , సుబ్రహ్మణ్యం , రఘు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

నడకతో గుండె జబ్బు నివారణ

రవిరాజును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నడకతో గుండె జబ్బు నివారించుకోవచ్చు అని అత్యవసర వైద్య నిపుణులు సిద్ధార్థ రెడ్డి తెలిపారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే ఎల్ ఎం మూర్తి అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ నడక వల్ల షుగర్ బీపీ గుండె జబ్బు నివారించుకోవచ్చన్నారు. పొగ, మద్యపానం సేవించడం వల్ల రక్తనాళాలు గడ్డ కట్టడం వల్ల గుండె జబ్బు వస్తుందని తెలిపారు. అలాంటి వ్యాధులు నివారణ ఉంచుకోవాలంటే నడకతో నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధికి సభ్యులు పీసీ కృష్ణమరాజు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఐఎంఏ ప్రెసిడెంట్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత డాక్టర్ రవి రాజు, సిద్ధార్థ రెడ్డిని వాకర్స్ అసోసియేషన్ తరపున ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ఆర్ముగం, రావిళ్ళ మాధవ నాయుడు, మాజీ అధ్యక్షులు రామచంద్ర నాయుడు, కార్యదర్శి మునికృష్ణయ్య, రఘునాథరెడ్డి, ట్రెజరర్ శేఖర్ రెడ్డి, సభ్యులు రామ్మోహన్ రాజు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, నరసింహారావు, సభ్యులు పాల్గొన్నారు .

టీడీపీలో భారీ చేరికలు

ప్రజాశక్తి-నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో నాయుడుపేట,పెళ్లకూరు, ఓజిలి మండలాల లోని గ్రామాల నుంచి భారీ స్థాయిలో గ్రామాలకు చెందిన గ్రామస్తులు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే విజయశ్రీ సమక్షంలో నాయుడుపేట టిడిపి కార్యాలయంలో ఆదివారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి గ్రామస్తులు టిడిపి కండువాలు కప్పుకుని టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీటిలో ఓజీలి మండలం నుంచి భారీగా చేరికలు జరిగాయి ఓజిలి మండలం లోని అత్తివరం గ్రామానికి చెందిన పాల్చూరు పెద్ద చెంగయ్య యాదవ్, చిన్న చెంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో అత్తివరం, కారూరు గ్రామాల నుండి టిడిపిలోకి భారీ సంఖ్యలో గ్రామస్తులు టిడిపిలో చేరారు ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా టిడిపి అధ్యక్షుడు నరసింహ యాదవ్ ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్ పార్టీలో చేరిన గ్రామస్తులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే ముమ్మాయిపాలెం గ్రామం నుండి సర్పంచ్ శంకు సుజాత, మహేంద్ర,ఎన్. నాగభూషణం, పి. విశ్వనాథ్, పి. నాగార్జున, పి. గోవర్ధన్, ఇంకా పలువురుకి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఓజిలి మండల టిడిపి అధ్యక్షులు విజయ్ నాయుడు,జిల్లా బీసీ సెల్ నాయకులు పాడి.వెంకటసుబ్బయ్య, నాయుడుపేట, పెళ్లకూరు, దొరవారి సత్రం మండలాల టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గాయపడ్డ విలేకరి మృతి

ప్రజాశక్తి- బుచ్చిరాయుడు కండ్రిగ: మండలంలో మనం దినపత్రిక విలేకరిగా పనిచేస్తున్న యాచమనేని శ్రీనివాసులు నాయుడు (47) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆరోగ్యం విషమించి మృతి చెందారు. వారం క్రితం శ్రీకాళహస్తి నుంచి పిచ్చాటూరుకి భార్యతో కలసి ద్విచక్రవాహనంలో వెళుతుండగా కెవిబిపురం మండలంలోని తిమ్మసముద్రం వద్ద ఆవు అడ్డు రావడంతో ద్విచక్రవాహనం నుంచి భార్య భర్తలు పడిపోయారు. శ్రీనివాసులు నాయుడు తలకు బలమైన గాయం కావడంతో శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో చైన్నెలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి మరింత క్షీణించి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసులు నాయుడు మృతికి మండలంలోని పలువురు రాజకీయ నాయకులు, విలేకరులు శ్రీనివాసులు నాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి సంతాపం ప్రకటించారు.

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని రాచగున్నేరి క్రాస్ వద్ద గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 8.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తులు కేరళ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ నజీర్, క్రిష్ణ కుమార్ లుగా గుర్తించారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు సీఐ రవి నాయక్ తెలిపారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి: ఆర్‌పిఐ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఈ నెల 26న జరిగే రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తిరుపతి చల్లప్ప మేస్త్రి మెమోరియల్ అంబేద్కర్ భవన్‌లో ఈ నెల 30వ తేదీ రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేశామని, ఈ సదస్సును జయప్రదం చేయాలని ఆర్‌పిఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు పి అంజయ్య కోరారు. సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పి అంజయ్య అధ్యక్షతన ఆదివారం ఎంఆర్‌పల్లి ఆర్‌పిఐ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షులు ఏ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘం తిరుపతి నగర అధ్యక్షులు కే బాబు (మంగళం), దేవానందరావు (చంద్రగిరి), బొజ్జాతారకం కాలనీ యువజన సంఘం నాయకులు ఎం నాగేంద్ర, బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గ్రూప్ థియేటర్లో హీరో గల్లా అశోక్ సినిమా వీక్షణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: దేవకీ నందన వాసుదేవ చిత్రానికి ప్రజల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని అమరరాజా సంస్థల ఛైర్మన్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ పేర్కొన్నారు. తిరుపతి గ్రూప్ థియేటర్స్ లో ప్రదర్శిస్తున్న చిత్రాన్ని హీరో గల్లా అశోక్‌తో పాటు ఆయన ఆదివారం వీక్షించారు. చిత్రం విడుదల సందర్బంగా గ్రూప్ థియేటర్స్ వద్ద అభిమానులు సందడి చేశారు. చిత్రాన్ని వీక్షించేందుకు వచ్చిన గల్లా జయదేవ్ మాట్లాడుతూ హీరో అశోక్ గల్లాకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. థియేటర్ ముందు బాణాసంచా కాల్చి కేక్‌కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. రోజు, రోజుకూ చిత్రానికి వస్తున్న ఆదరణ చూసి సంతోషంగా ఉందని గల్లా జయదేవ్ అన్నారు. చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. చిత్ర పబ్లిసిటీ తక్కువగా ఉన్నా ప్రేక్షకులు ఈ చిత్రాన్ని విజయవంతం చేశారని హీరో గల్లా అశోక్ తెలిపారు. ఈ చిత్రాన్ని వీక్షించి మీడియాతో మాట్లాడిన వారిలో చిత్ర కథనాయకుడు అశోక్ గల్లా, సిద్ధార్థ గల్లా, హర్ష గౌరినేని, నరసింహనాయుడు , బాలకృష్ణారెడ్డి, ఎంఆర్‌సి రెడ్డి, మునినాదం, బడి సుధా యాదవ్, బాబ్జి ఉన్నారు.

'నేరాలకు పాల్పడితే శిక్ష తప్పదు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నేరాలకు పాల్పడే వారికి శిక్ష తప్పదని శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసులు హెచ్చరించారు. తొట్టంబేడు మండలంలోని శివనాథపాళెంలో ఆదివారం సాయంత్రం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలు వినియోగించినా, రవాణా చేసినా తీవ్ర నేరంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో పలు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. సరైన వాహన ధృవపత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటోను స్వాధీనం చేసుకుని స్టేషన్ కు తరలించారు. బీఎన్ కండ్రిగ సీఐ తిమ్మయ్య, రూరల్ సీఐ రవినాయక్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో అనాథ మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం మంగళం పంచాయతీ పరిధిలో జరిగింది. కేరళ రాష్ట్రానికి చెందిన ప్రమోద్(ప్రభు) అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం మంగళం ప్రాంతానికి వచ్చి ఇక్కడే స్థానికంగా చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంగా ఉండడంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. అయినవారు లేకపోవడంతో స్థానికంగా ఉన్న యువత, ప్రమోద్ పని చేసిన యజమాని మధు అంత్యక్రియలకు నగదు సమీకరించి గోవింద గ్రామంలో మృతదేహాన్ని ఖననం చేశారు. తిరుచానూరు పోలీసులు ప్రమోద్ మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించారు.

జెపి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ వై.జె.పి ఆధ్వర్యంలో పలు విస్తృత సేవా కార్యక్రమాలు పట్టణంలోని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతం , క్యాబినెట్ సెక్రటరీ జనార్ధన్ రావు , ట్రెజరర్ హనుమంతురావు లు పాల్గొన్నారు. కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలు కు సర్టిఫికెట్ లను అందచేశారు .అనంతరం కుట్టు మిషన్ ను అందచేశారు.అనంతరం పేదలకు దుప్పట్లు, విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ క్లబ్ ద్వారా పట్టణ , పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మనోజ్ కుమార్, ఎస్. ఎల్. ఎన్ స్వామి, ఆర్.వి.రావు , మురళీ నాయుడు , శ్రీను ,రాజేంద్ర ప్రసాద్ , శివరాం, వెంకటేశ్వర రావు , జానకీ, జగదీష్ పాల్గొన్నారు.

నేరాల కట్టడికే కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేరాల కట్టడి కే కార్డన్ సెర్చ్ అని గూడూరు ఒకటవ పట్టణ సీఐ శేఖర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని ధూర్జటి నగర్ లో పోలీసు లు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సి. ఐ శేఖర్ బాబు మాట్లాడుతూ ప్రజలు అనుమానితులు కనపడితే పోలీసు లకు సమాచారం ఇవ్వాలన్నారు. సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను , ఒక ఆటో ను సీజ్ చేశామన్నారు. నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సి. ఐ శ్రీనివాస్ , ఎస్. ఐ లు గోపాల్ యాదవ్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణానికి చెందిన అత్తి మంజరి గోపాల్ మల్లేశ్వరి దంపతుల 37వ పెళ్లిరోజు సందర్భంగా ఆదివారం గూడూరు రెండవ పట్టణం లోని నరసింగరావుపేట లో ఉన్న బాలసదనంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పిల్లలు, కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సమక్షంలో పెళ్లిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ట్రస్ట్ సభ్యులు , బాలసదనం నిర్వాహకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు, సెక్రటరీ పాల్గొన్నారు.

వెంకటగిరి పురపాలక సంఘం

పత్రికా ప్రకటన

ఆర్.ఓ.సి.నెం. 1133/VMC/Eng/ODF+/2024-25 తేదీ: 23.11.2024

స్వచ్ఛ భారత్ అభియాన్ ప్రోగ్రాములో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ 2024 లో వెంకటగిరి పురపాలక సంఘ సంస్థ పాల్గొనుట జరుగుచున్నదని పట్టణ ప్రజలకు తెలియజేయడమైనది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వముల నిభందనలననుసరించి, వెంకటగిరి పట్టణమును బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణము (ODF+) మరియు చెత్తరహిత నగరము 1 స్టార్ రేటింగ్ (GFC-1 Star) తరగతులు యందు సర్టిఫికేషన్ కొరకు దగలాసు చేయుట జరుగుచున్నది. ఈ విషయమై పైపట్టణ ప్రజలు నుండి సలహాలు, సూచనలు అభ్యంతరములు ఆహ్వానించుట జరుగుచున్నది. సదరు సూచనలు మరియు అభ్యంతరములు, వెంకటగిరి పురపాలక సంఘ కార్యాలయమునకు వ్యక్తిగతంగా హాజరయి వ్రాతపూర్వకంగా లేక vmc_municipality@yahoo.com మెయిల్ ద్వారా తెలియజేయవలసినదిగా విజ్ఞప్తి

కమీషనరు
వెంకటగిరి మునిసిపాలిటి